సాక్షి కామారెడ్డి

శనివారం ı 9 ı సెప్టెంబర్ ı 2023



వినూత్న నిరసన

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం బోనాలతో నిరసన తెలిపారు.

- 10లో ▸



లష్కర్లు వచ్చారు

నీటిపారుదల శాఖలో లష్కర్ల నియామకంతో సాగునీటి నిర్వహణ మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

- 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.5 /21.9

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'టెట్‌ను సజావుగా నిర్వహించాలి'



కామారెడ్డి క్రైం: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)ను సజావుగా నిర్వహించాలని డీఈవో రాజు సూచించారు. టెట్ నిర్వహణకోసం నియమించిన అధికారులకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మట్లాడుతూ ఈనెల 15న నిర్వహించాల్సిన టెట్ కోసం జిల్లాకేంద్రంలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సెషన్‌లో 5,535 మంది, రెండో సెషన్‌లో 4,205 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 100 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, హాల్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులను నియమించామన్నారు. పరీక్ష నిర్వహణపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. పలు అంశాలపై డీఈవో, పరీక్షల సహాయ సంచాలకుడు లింగం అవగాహన కల్పించారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే 76618 54856 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

పెంచిన వేతనాలను చెల్లించాలి



కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను చెల్లింపునకు సంబంధించి బడ్జెట్‌ను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రతినిధులు శుక్రవారం డీఈవో రాజుకు వినతిపత్రం ఇచ్చారు. కొత్త మెనూను సవరించి, స్లాబ్ రేట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటేశం, లింగం, వాణి, సంధ్య, సరోజన, లక్ష్మి, జానకి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘటితాన్ని తట్టుకోలేకే కుట్రలు

నవీపేట: సనాతన ధర్మాన్ని కాపాడుకునే దిశగా సంఘటితం అవుతున్న హిందూ శక్తిని తట్టుకోలేక కొందరు రాజకీయ నాయకులు కుట్రలు పన్నుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నవీపేటలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి ఊళ్లో శివాజీ మహరాజ్‌లు తయారు కావాలన్నారు. ఇందూరు ఖిల్లా జైలు గోడలపై దాశరథి రాసిన కవితల స్ఫూర్తిగా మరోమారు సనాతన ధర్మ రక్షణకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులులు వడ్డీ మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ శివకుమార్, లింగం గుట్ట సిద్దేశ్వర మహారాజ్ పాల్గొన్నారు.

'దమ్ముంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి'



కామారెడ్డి టౌన్: ఎస్సారెస్పీ నుంచి కామారెడ్డికి వచ్చే గోదావరి జలాల పైప్‌లైన్ పనులు నాసిరకంగా ఉండడం వల్లే లీకేజీలంటున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్.. దమ్ముంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కేసీఆర్‌కు ఫిర్యాదు చేయాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 15 ఏళ్లుగా కామారెడ్డికి గోదావరి జలాలు అందుతున్నాయని, ఏనాడూ తీవ్ర స్థాయిలో తాగునీటికి ఇబ్బందులు ఎదురవలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పనులు చేసిన మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ కంపెనీయే గోదావరి జలాల పనులు చేసిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నాణ్యతపై సవాల్ చేస్తే.. సమాధానం చెప్పకుండా పారిపోయిన వ్యక్తి ఎస్సారెస్పీ పైప్‌లైన్ పనుల నాణ్యతపై మాట్లాడుతున్నారని విమర్శించారు. గంప గోవర్ధన్‌ను బుజ్జగించేందుకు సీఎం కేసీఆర్ అభివృద్ధి పేరుతో రూ.195 కోట్లను ప్రకటించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయడం చేతగాని నంబర్ వన్ ఎమ్మెల్యేగా గంపకు పేరు దక్కిందని, అందుకే ఆయనను పక్కన పెట్టి సీఎం కేసీఆర్ కామారెడ్డికి వచ్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఓడించే అవకాశం తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కామారెడ్డిని దోచుకోవడానికి వస్తున్న కేసీఆర్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.



కామారెడ్డిపై ఫోకస్!

- ప్రగతి భవన్‌నుంచి గంప గోవర్ధన్‌కు పిలుపు
- సీఎంతో సమావేశమైన ప్రభుత్వ విప్
- చేపట్టాల్సిన పనులపై మాట్లాడిన కేసీఆర్
- పెండింగ్ పనులు, పార్టీ పరిస్థితులపై ఆరా తీసిన బీఆర్ఎస్ అధినేత

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిపై ఫోకస్ చేశారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను ప్రగతిభవన్‌కు పిలిపించారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. అర్జెంట్‌గా రావాలని ప్రగతిభవన్ నుంచి పిలుపు రావడంతో గంప అన్ని కార్యక్రమాలను వాయిదా వేసుకుని వెళ్లి సీఎంను కలిశారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి గురించి సీఎం అడిగి తెలుసుకున్నారని సమాచారం.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరిగింది. సీఎం పోటీ ప్రకటనతో గులాబీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. అయితే నియోజకవర్గంలో బలంగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు వెనక్కి తగ్గేది లేదని, సీఎంను ఓడిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పరిస్థితిని తెలుసుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వ విప్ గంపతో మాట్లాడినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయి? ఏయే పనులు చేపట్టాలన్న దానిపై వివరాలు తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఏ ఫైల్ ఉన్నా త్వరితగతిన ముందుకు కదిలిస్తున్నారు. ఇదే సమయంలో ప్రజలు ఏం ఆశిస్తున్నారన్న దానిపైనా ప్రభుత్వ పెద్దలు ఆరా తీశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో మెల్లమెల్లగా ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఉన్నట్టు స్పష్టమవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కామారెడ్డి ప్రాంతానికి తాగునీటిని అందించే పైపులైన్ స్థానంలో కొత్త పైపులైన్ కోసం ఇప్పటికే రూ.195 కోట్లు మంజూరు చేసిన సీఎంకు గంప గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, అభివృద్ధి తదితర అంశాలతో పాటు విపక్షాల బలాబలాలపై సీఎం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌తోనూ సమావేశం..

సీఎంను కలిసేకన్నా ముందు గంప గోవర్ధన్ మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనతో చర్చించారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి మాట్లాడినట్లు తెలిసింది.

దరఖాస్తులు 3,333

- కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- అప్లికేషన్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు
- రేపటినుంచి రెండు రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ



కామారెడ్డి టౌన్: జిల్లాలో బదిలీల కోసం 3,333 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించారు. వాటిని విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. దరఖాస్తుల జాబితాను కార్యాలయంతోపాటు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ లోనూ అందుబాటులో ఉంచారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆది, సోమవారాలలో అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

జిల్లాలో 4,938 ఉపాధ్యాయ పోస్టులుండగా 4,078 మంది టీచర్లున్నారు. ఇందులో పీజీ హెచ్‌ఎంలుగా 40 మంది, స్కూల్ అసిస్టెంట్‌లుగా 238 మంది పదోన్నతులు పొందనున్నారు. అలాగే స్పౌజ్ కేటగిరిలో 35 మంది ఉపాధ్యాయులకు న్యాయం జరగనుంది. అయితే సీనియారిటీ, ఖాళీల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 12,13వ తేదీలలో సీనియారిటీ జాబితాను ప్రదర్శిస్తారు. 14న ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నారు. 16న హెచ్‌ఎం పోస్టుల ఖాళీలను వెల్లడిస్తారు. 17 నుంచి 19 వ తేదీ వరకు పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తారు.

పారదర్శకంగా జరిగేనా?

అనుకూలమైన స్థానాన్ని పొందేందుకు కొందరు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కినట్లు తెలుస్తోంది. బదిలీల్లో 'ప్రాధాన్యత' కేటగిరికి అదనపు పాయింట్లు కేటాయిస్తారు. ఈ అదనపు పాయింట్లకోసం లేని కొందరు రోగాలు ఉన్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. మరికొందరు పైరవీలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలపై అభ్యంతరాలు తెలిపేందుకు రెండు రోజుల గడువుంది. దరఖాస్తుల పరిశీలనలో తప్పుడు ధ్రువీకరణ పత్రాల వ్యవహారం బయటపడుతుందో లేదో చూడాలి. బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బాన్సువాడ బంద్ ప్రశాంతం

బాన్సువాడ: తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ హిందూవాహిని ఆధ్వర్యంలో శుక్రవారం బాన్సువాడలో బంద్ నిర్వహించారు. వ్యాపారులు దుకాణాలను మూసి ఉంచి బంద్‌కు మద్దతు తెలిపారు. హిందూవాహిని ప్రతినిధులు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉదయనిధి దిష్టిబొమ్మను తగలబెట్టారు. హిందూవాహిని జిల్లా ప్రచార ప్రముఖ్ సునీల్‌రావు, ప్రతినిధులు గుడిమెట్ మహాదేవ్ మహరాజ్, నాగభూషణం అప్పా, సాయిప్రసాద్, అఖిల్, వంశి, మహేందర్, నవీన్, బన్నీ, నివర్తి, నాందేవ్, రమేష్, రాకేష్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు

'కేసీఆర్‌కు గుణపాఠం చెబుతాం'



అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కేటాయించకుండా అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని ముదిరాజ్ సంఘాల నేతలు హెచ్చరించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ముదిరాజ్ మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, తీర్మానాలు చేశారు. 45 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను శాసించే స్థితిలో ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్కసీటు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీనిపై తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడైన బండ ప్రకాశ్ మౌనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో ముదిరాజులందరూ ఏకమై ఆయనను ఓడించాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లకు న్యాయం చేసే రాజకీయ పార్టీలకు తమ మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేందర్ శివయ్య, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ ముదిరాజ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కరాటే రమేష్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు విజయానంద్, బట్టు విట్టల్, సూర్యప్రసాద్, పిట్ల భూమేశ్, పిల్లి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో శాంతి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 18 న ప్రారంభమై 28 న నిమజ్జనంతో ముగుస్తాయన్నారు. నిమజ్జనం రోజునే మిలాద్ ఉన్ నబీ ఉందన్నారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. శోభాయాత్ర రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని, ఆ మార్గంలో గుంతలు లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువుల వద్ద తొక్కిసలాటలు, నీటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జనానికి 24 గంటల ముందు మద్యం దుకాణాలను మూసి ఉంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు, నీరు కలుషితం కాకుండా మట్టి గణపతుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జగ్నేకీ రాత్ సందర్భంగా దర్గాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచిచంఆరు. రాత్రి వేళలో విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. రెండు పండుగలు ఒకేసారి వచ్చిన నేపథ్యంలో హిందూ, ముస్లింలు శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డీజేలకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, భుజంగరావు, డీఎస్పీలు ప్రకాష్, శ్రీనివాసులు, జగన్నాథ్ రెడ్డి, శాంతి కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నాం'

భిక్కనూరు: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారి స్మారకార్థం ఢిల్లీలో నిర్మించే అమృతవన్ కోసం ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నామని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతంపల్లి గ్రామంలో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేశారని, వారి త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. అమృత కలశాలలో ప్రతి ఇంటినుంచి మట్టిని సేకరిస్తున్నామని, అన్ని గ్రామాలనుంచి సేకరించిన మట్టిని త్వరలో ఢిల్లీకి పంపిస్తామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను ముదిరాజు సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు వలకొండ రవీందర్‌రెడ్డి, గోల్కొండ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, బస్వారెడ్డి, గణేశ్‌రెడ్డి, జైపాల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



అంతంపల్లిలో సేకరించిన మట్టితో బీజేపీ నేతలు

ఖాకీ డ్రెస్ వెనక కన్నీటి వెతలు

- ఎంత చాకిరి చేసినా అరకొరే వేతనం
- ఉద్యోగ భద్రత లేక ఆందోళన
- ఆవేదన చెందుతున్న హోంగార్డులు

ఖాకీ దుస్తులు ధరించి విధులు నిర్వహించే హోంగార్డుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. ఎంత చాకిరి చేస్తున్నా అరకొర వేతనాలే అందుతున్నాయి. దీంతో కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొంది. వయసు పైబడుతున్న కొద్దీ ఉద్యోగ భద్రత మీద నమ్మకం కోల్పోతున్నారు. ఏళ్ల గడుస్తున్నా పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



సాక్షి, కామారెడ్డి: పేరుకు పోలీసు శాఖలో ఉద్యోగం అని చెప్పుకోవడమే గాని హోంగార్డులలో చాలామందిది పూట గడవని పరిస్థితి. పోలీసులతో సమానంగా సేవలందిస్తున్నా.. అరకొర వేతనాలకు తోడు ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్నారు.

జిల్లాలో సుమారు 220 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. రోజుకు రూ. 920 వేతనం పొందుతున్న వీరికి ఎలాంటి అలవెన్సులు, సెలవులు ఉండవు. అవసరం ఉండి అనుమతి తీసుకుని డ్యూటీకి వెళ్లకుంటే ఆ రోజు వేతనం కోల్పోవాల్సిందే. జ్వరం వచ్చినా, ఇంట్లో ఫంక్షన్ ఉన్నా, బంధువుల పెళ్లికి వెళ్లాల్సి ఉన్నా విధులకు రావాల్సిందే.. లేకపోతే ఆ రోజు వేతనాన్ని కోల్పోవాల్సి వస్తుంది. హోంగార్డులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఉండవు. అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం ఇబ్బందులు పడాల్సిందే. హోంగార్డుల్లో ఎవరైనా ఏదేని పరిస్థితుల్లో తనువు చాలిస్తే అందరూ తలాకొంత జమ చేసుకుని సాయం అందిస్తూ ఒకరికొకరు ఆసరా అవుతున్నారు. అలాగే ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులపాలైనపుడు కూడా అండగా నిలుస్తున్నారు.

పొద్దస్తమానం పనిచేయాల్సిందే...

చాలాచోట్ల హోంగార్డులకు జాబ్‌చార్ట్ అమలు కాదు. అధికారులు చెప్పినంత సేపు ఉండాల్సిందే. అధికారి అనుమతి ఇస్తేనే ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల ఆఫీసు పనులతోపాటు ఇంటి పనులు కూడా చేయించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

ఉత్తి చేతులతో ఉద్యోగ విరమణ...

సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం చేస్తున్న వారికి రకరకాల బెనిఫిట్స్ వస్తుంటాయి. పోలీసు శాఖలో పనిచేసే హోంగార్డులకు మాత్రం అవేమీ వర్తించవు. రిటైర్మెంట్ అయ్యేనాడు ఎలాంటి డబ్బులు చేతికి రాకపోవడంతో ఉత్తి చేతులతోనే ఉద్యోగాన్ని విరమించాల్సి వస్తోంది. చేతిలో చిల్లి గవ్వ లేకుండానే శేషజీవితం గడపాల్సిన పరిస్థితి.. ఏళ్లుగా హోంగార్డులు తమ జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకుంటూనే ఉన్నారు. అప్పట్లో సీఎం కేసీఆర్ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారని హోంగార్డులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరుతున్నారు.

జీవితమంతా వేదనే...

హోంగార్డుల వయసు కరిగిపోయినా ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావడం లేదు. దీంతో ఉద్యోగ భద్రత లేక చాలామంది మనోవేదనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్నచిన్న పొరపాట్లకు, తెలియకుండా జరిగే తప్పులకు అధికారులు తీసుకునే చర్యలతో ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులకైతే మెమోలతో సరిపెడతారు. హోంగార్డులను మాత్రం ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఉద్యోగ విరమణ చేసేదాకా వేదనతోనే గడుస్తోంది. అరకొర వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం, పిల్లల్ని చదివించడం ఇబ్బందికరంగా ఉందని హోంగార్డులు అంటున్నారు. కానిస్టేబుళ్లతో సమానంగా పనులు చేస్తున్నా.. సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'లక్ష'ణమైన అలంకరణ



కరెన్సీతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

కామారెడ్డి టౌన్: శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాసవినగర్‌లోగల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని రూ. 1,01,111 నూతన కరెన్సీ నోట్లు, కాయిన్స్‌తో అలంకరించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి భూమేశ్‌గుప్తా, కోశాధికారి విశ్వనాథుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

బాలల సంరక్షణ అధికారులకు బాలిక అప్పగింత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన ఓ మహిళ 15రోజుల క్రితం విక్రయించిందనే ప్రచారం జరిగిన బాలికను శుక్రవారం స్థానిక పోలీసులు జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు. గోపాల్‌పేటకు చెందిన మహిళ పేదరికంతోపాటు పోషణభారమై తన పెద్దకూతురు నాగలక్ష్మిని లింగంపేట మండలం పొల్కంపేటకు చెందిన వారికి అప్పగించింది. ఈ విషయం బయటకు రావడంతో జిల్లా అధికారులు గురువారం నాగిరెడ్డిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలికను బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు.

విదేశాలకు తపాలా శాఖ పార్సిల్ సర్వీస్ సేవలు



కామారెడ్డి టౌన్/రాజంపేట: తపాలా శాఖ ద్వారా తక్కువ ఖర్చుతో విదేశాలకు పార్సిల్ సర్వీస్ సేవలను ప్రారంభించినట్లు కామారెడ్డి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ సేవల కోసం నిజామాబాద్, కామారెడ్డిలో ప్రత్యేకంగా డాక్ నిర్యత్ కేంద్రాలను(డీఎన్‌కే) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ లైసెన్స్, ఐఈసీ కోడ్ కలిగిన సంస్థలు ఈ డీఎన్‌కేల ద్వారా సులభంగా విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బురదమయంగా ఎల్లారెడ్డిపల్లి తండా రోడ్డు



రాజంపేట: ఎల్లారెడ్డిపల్లి తండా రోడ్డు బురదమయంగా మారింది. దీంతో తండా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి తండా మధ్య బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల ఆ మార్గంలో వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో కొండాపూర్ నుంచి ఎల్లారెడ్డిపల్లి, గుండారం గ్రామాలకు ప్రయాణం కొనసాగించాలంటే శేర్‌శంకర్ తండా, ఎల్లారెడ్డిపల్లి తండాల మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. అయితే ఎల్లారెడ్డిపల్లి, శేర్‌శంకర్ తండాల మధ్య బీటీ రోడ్డు లేకపోవడంతో రోడ్లన్నీ బురదమయమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తండాకు బీటీ రోడ్డు వేయాలని తండావాసులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు తీపి కబురు

- జిల్లాలో 309 టీఆర్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 20 నుంచి పరీక్షలు



పాఠాలు బోధిస్తున్న టీచర్

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగులకు సర్కారు తీపి కబురు వినిపించింది. జిల్లాలో 309 టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2017లో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేసిన ప్రభుత్వం మరోమారు నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లా నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం ఈ నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనుంది. నవంబర్ 20 నుంచి 30వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు నెలల సమయమే ఉన్నందున అభ్యర్థులు పరీక్షలకు సిద్ధం కానున్నారు. టీఆర్టీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్‌తో ఊపిరిపోసినట్లయ్యింది.

తగ్గిన పోస్టులు.. పెరిగిన పోటీ

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 309 టీఆర్టీ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 96, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 183, లాంగ్వేజ్ పండిట్ 21, పీఈటీలు 9 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని భర్తీ చేయనుంది. కాగా ఇదివరకే టెట్ ఉత్తీర్ణులైన వారి సంఖ్యను పరిశీలిస్తే పెద్ద మొత్తంలో పోటీ పెరిగింది. జిల్లాలో టెట్ ఉత్తీర్ణత అభ్యర్థులు పేపర్–1లో 4880, పేపర్–2లో 5383 మంది ఉన్నారు. ప్రస్తుతం ఈనెల 15న మరోసారి టెట్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 12వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు సైతం ఈ పరీక్షకు హాజరుకానున్నారు. 309 పోస్టులకు సుమారు 20వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

ఆటంకాలు లేకుండా చేపట్టాలి



ప్రభుత్వం ఎలాంటి ఆటంకాలు లేకుండా టీఆర్టీ నిర్వహించాలి. కొనేళ్లుగా అభ్యర్థులు ఉపాధ్యాయుల పోస్టుల కోసం ఎదురుచూస్తున్నరు. ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలి.

– రమావత్ లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

పోస్టుల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య మరింత పెంచాలి. పోటీకి అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున పునరాలోచించాలి. టీఆర్టీ ప్రకటన కోసం నిరుద్యోగులు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.

– అనిల్, టీఆర్టీ అభ్యర్థి

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల వినూత్న నిరసన

- 12వ రోజుకు చేరుకున్న నిరవధిక దీక్షలు



పోతరాజు, అమ్మవారి వేషధారణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల చేపట్టిన నిరవధిక సమ్మె దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ కార్యాలయం ముందు ఉద్యోగులు వినూత్నంగా నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉద్యోగులు బోనాల ఊరేగింపు, పొర్లుదండాలు, పోతరాజుల విన్యాసాలు, విభిన్న వేషధారణలతో నిరసన తెలిపారు. ఉద్యోగులు బోనాలు ఎత్తుకుని మున్సిపల్ కార్యాలయం దీక్షా శిబిరం నుంచి కొత్త బస్టాండ్ ముందు మైసమ్మ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి పూజలు చేశారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని వేడుకున్నారు. మైసమ్మ తల్లి సీఎం కేసీఆర్ కలలోకి వచ్చి తమ డిమాండ్‌లను పరిష్కరించేలా చేయాలని మొక్కారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు భాను, వీణ, తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌సైన్సెస్, కామర్స్ డీన్ల నియామకం




తెయూ(డిచ్‌పల్లి): టీయూ సోషల్ సైన్సెస్ డీన్‌గా ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కామర్స్ డీన్‌గా జి.రాంబాబు నియామకమయ్యారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి నియామక ఉత్తర్వులను శుక్రవారం తన చాంబర్‌లో అందజేశారు. అనంతరం చంద్రశేఖర్, రాంబాబులను ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

సంఘటితంతోనే హక్కుల సాధన

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్



మున్సిపల్ ఫోరం నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోవచ్చని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. నగరంలోని టీఎన్జీవో కార్యాలయంలో కిషన్ అధ్యక్షతన తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల ఫోరం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. ఉద్యోగులు వారి సమస్యలపై ప్రస్తావించి, చర్చించారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామని కిషన్ పేర్కొన్నారు.

అనంతరం తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల ఫోరం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.విజయ్ సింగ్, కార్యదర్శిగా ఎల్. శేఖర్, ఉపాధ్యక్షులుగా మోహన్, కోశాధికారిగా దత్తారెడ్డి, 21 మంది జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అలుక కిషన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, సతీశ్‌కుమార్, జి. ప్రభాకర్, వెంకట గోపాల్, జాఫర్ హుస్సేన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లాట్లు ఇప్పించి న్యాయం చేయండి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన దళితులు

కామారెడ్డి క్రైం: గ్రామానికి చెందిన కొందరు నాయకులు తమకు గతంలో కేటాయించిన ప్లాట్ల విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ తాడ్వాయి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన దళితులు శుక్రవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తూ దాడులకు దిగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. 2000లో ప్రభుత్వం 156, 181 సర్వే నంబర్లలో 60 మంది బీసీలకు, మరో 60 మంది దళితులకు ప్లాట్లు కేటాయించిందని తెలిపారు. ఇటీవల బీసీలు ఆ స్థలంలో హద్దులు వేసుకోవడంతో తాము కూడా తమకు కేటాయించిన స్థలంలో హద్దులు వేశామన్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు తమను కులం పేరుతో దూషిస్తూ, దళితులు వెనక భాగంలో ఉండాలని, ముందుకు రావద్దని ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు. గ్రామంలో దళితబంధు, బీసీ బంధు పథకాల మంజూరులో కూడా కమీషన్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తమ స్థలాలను తమకు ఇప్పించాలని కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

జన ఆరోగ్య సమితి ఏర్పాటు



మాట్లాడుతున్న అధికారి శిరీష

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవల కోసం జన ఆరోగ్య సమితి ఏర్పాటు చేస్తున్నట్లు జన ఆరోగ్య సమితి జిల్లా ప్రొగ్రామ్ అధికారి శిరీష తెలిపారు. శుక్రవారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. కమిటీ సభ్యులు మండల స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలో 11 వైద్య ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో జన ఆరోగ్య కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు డీఎంహెచ్‌వో శోభారాణి, సర్పంచ్‌లు బొల్లు లావణ్య, బండి రాజయ్య, ఎంపీపీ గరీబున్నిసాబేగం, మండల వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది యాదగిరి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కామారెడ్డి రూరల్: ప్రజాకవి కాళోజి జయంతిని పురస్కరించుకొని నర్సన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు భాష గొప్పతనం గురించి తెలియజేసే నృత్య ప్రదర్శనలు చేయించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా శ్రీదేవి వ్యవహరించగా తెలుగు భాషా పండితులు పద్మావతి, ఉపాధ్యాయులు సీహెచ్ లింగం, సుజాత వేద నిరంజని, కీర్తితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మానవజన్మ ఎంతో గొప్పది

- ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అన్ని జన్మలోకెల్లా మానవ జన్మ ఎంతో గొప్పదని ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) కంఠేశ్వర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఏసీ భక్తివేదాంత శ్రీల ప్రభుపాద జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానందరాయ్ గౌరదాస్ భక్తులకు ప్రవచనాలు వినిపించారు. శ్రీల ప్రభుపాదుల వారు 1896లో జన్మించారని, 1966లో ఇస్కాన్‌ను స్థాపించి హరేకృష్ణ ఉద్యమాన్ని మొదలుపెట్టారన్నారు. మానవ జన్మతో జ్ఞానాన్ని పెంచుకుని మోక్షాన్ని పొందాలన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ప్రబోధించిన భగవద్గీతను చదివితే జన్మ సార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో మాదాసు స్వామియాదవ్, నరేశ్, ముకుంద్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు బతుకమ్మ కానుకలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : బతుకమ్మ చీరలు విడతల వారీగా జిల్లాకు చేరుకుంటున్నాయి. ఇందులో ఆరు మీటర్లు, తొమ్మిది మీటర్ల చీరలున్నాయి. గతేడాది జిల్లాలో 4 లక్షలకు పైగా చీరలను పంపిణీ చేశారు. ప్రస్తుత ఏడాదికి 6,33,116 చీరలు అవసరమని గ్రామీ ణాభివృద్ధి శాఖ అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపారు. ఇప్పటివరకు 1,60,700 చీరలు విడతల వారీగా జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో ఆరు మీటర్ల చీరలు 1,08,000, తొమ్మిది మీటర్ల చీరలు 52,700 ఉన్నాయి. మిగతా చీరలు కూడా మరో రెండు వారాల్లో జిల్లాకు చేరుకోనున్నాయి. ఈ నెలాఖరులో చీరల పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి. వచ్చిన చీరలను జాగ్రత్తగా మండల సమాఖ్య భవనాల్లో భద్రపర్చాలని ఏపీఎంలకు ఆదేశాలిచ్చినట్లు డీఆర్‌డీవో చందర్ నాయక్ తెలిపారు.

జడ్జిని కలిసిన సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: నగరంలోని కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత ను నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీస్‌కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కోర్టులో నిందితులను సరైన సమయంలో హాజరు పర్చాలని, విచారణ సమయంలో పోలీసుల పాత్రపై కోర్టు కానిస్టేబుళ్లకు పూర్తి అవగాహన కల్పించడానికి శిక్షణ ఇప్పించాలని సీపీకి సూచించారు. డీసీపీ ఎస్. జయరామ్, ఏసీపీ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

వైద్యం వికటించి పసికందు మృతి



పిట్లం(జుక్కల్): ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి పసికందు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మానగర్‌కు చెందిన జైపాల్ అనితలకు నెల పసిబాబు ఉన్నాడు. బాబు ఏడవడం, మోషన్స్ తీవ్రంగా పోతున్నాడని పిట్లంలోని ఓ ఆర్ఎంపీకి చూయించారు. పరీక్షించిన ఆర్ఎంపీ రెండు మందులు రాసిచ్చి పంపించారు. ఇంటికి వెళ్లిన జైపాల్‌అనిత తమ పసికందుకు మందులు పోశారు. దీంతో బాబు మరింత ఎక్కువగా ఎడవడం, మోషన్స్ పోతూ స్పృహ తప్పాడు. కొద్దిసేపటికి శ్వాస తీసుకోవడం ఆపేసినట్లు గుర్తించే సరికి మృతి చెందాడు. ఆర్ఎంపీ ఇచ్చిన మందులకే తమ బాబు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

క్రైం కార్నర్

చెరువులో పడి యువకుడి మృతి



గాజీరాం (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ శివారులోని పెద్ద చెరువులో ఓ యువకుడు పడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కారేగాం తండాకు చెందిన గాజీరాం (30) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిన గాజీరాం తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికుల సమాచారం మేరకు పెద్ద చెరువులో మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఇందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో చెరువులో దూకి ఒకరు..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన నార్లవార్ శంకర్(30) మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మద్నూర్‌కు చెందిన శంకర్ తన తండ్రి లక్ష్మణ్, బావ భార్మజీతో గొడవ జరిగింది. దీంతో తన భర్త మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కమలాబాయి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి



ఎడపల్లి(బోధన్): ఎడపల్లికి చెందిన పల్లికొండ సాయవ్వ (60) అనే వృద్ధురాలు స్థానిక చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు శుక్రవారం తెలిపారు. చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గురువారం అదృశ్యమైన సాయవ్వ మృతదేహంగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు..



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన కుర్మ నవీన్, శేఖర్, ఐలయ్యలకు చెందిన 14 గొర్రెలపై గురువారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. సుమారు రూ.1 లక్ష 50 వేలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

సైబర్ మోసానికి గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి నార్కోటిక్ పోలీసుల పేరిట సైబర్ మోసానికి పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెడెక్స్ కొరియర్ కంపెనీకి చెందిన వారిమని మీరు పంపిన పార్సల్‌లో మత్తు మందులు ఉన్నాయని, ఈ కేసులో నార్కోటిక్ పోలీసులు ఇన్వాల్ అయ్యారని చెప్పారు. దీనికి మీ రెండు బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు వేయాలని తెలుపగా రూ.1,97,778 వేసినట్లు తెలిపారు. వారిపై అనుమానం రావడంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజలు ఇలాంటి కాల్స్ వస్తే డబ్బులు వేయొద్దని ఎస్‌హెచ్‌వో సూచించారు. తాము సైబర్ మోసానికి గురైనట్లు తెలిస్తే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఐస్‌క్రీమ్ కంపెనీకి నోటీసులు



భిక్కనూరు: మండల కేంద్రంలో శుభ్రత పాటించని ఐస్‌క్రీమ్ కంపెనీ నిర్వాహకుడికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత నోటీసులు అందజేశారు. మండల కేంద్రంలోని కిరాణాదుకాణాలు, హోటళ్లు, ఐస్‌క్రీమ్ కంపెనీలను శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద శుభ్రత పాటించాలని సూచించారు. ఆహార పదార్థాలకు సంబంధించిన లైసెన్స్‌లను పొందాలన్నారు. ఎవరైనా లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

వివాహిత అదృశ్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన వివాహిత సల్మాబేగం అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం నల్లమడుగు నుంచి సయ్యద్ సలావుద్దీన్ భార్య సల్మాబేగం పిల్లలతో కలిసి పిట్లంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. సలావుద్దీన్ బతుకుదెరువు నిమిత్తం దుబాయ్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లిన సల్మాబేగం తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త సలావుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణాలు పోయినా పట్టించుకోరా..



నీటితో నిండి ఉన్న పిల్లర్ల గుంతలు

బాల్కొండ: మండలంలోని ఇత్వార్‌పేట్‌లో వీడీసీ భవన నిర్మాణానికి తవ్విన పిల్లర్ల గుంతలో ఇద్దరు చిన్నారులు పడి మృతిచెందినా వాటి గురించి ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. శుక్రవారం సైతం గుంతలో నీరు నిండుగానే ఉంది. ఇటీవల వీడీసీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్‌గా మాజీ ఉపసర్పంచ్ అవతారమెత్తి పనులను ప్రారంభించాడు.

15 రోజుల క్రితం పిల్లర్ల కోసం గుంతలు తవ్వి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశాడు. భారీ వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరింది. ఇది గమనించని గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు నాస్తిక్, నిషాంత్ చరణ్ గుంతలో గురువారం పడి మృతి చెందారు. శుక్రవారం సైతం గుంతలో ఉన్న నీటిని తొలగించకపోవడం, రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ. నాలుగు లక్షలకు రెండు ప్రాణాలు..

గుంతలో పడిలో మృతి చెందిన రెండు ప్రాణాలకు రూ. నాలుగు లక్షలకు వెల కట్టినట్లు తెలిసింది. ఈ నగదు సైతం విడతల వారీగా నాలుగు నెలల్లో రెండు కుటుంబాలకు చెల్లించాలని గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరినట్లు సమాచారం. చిన్నారుల మృతికి కారణమైన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు.

నేడు కాంగ్రెస్ మండల అధ్యక్షులకు శిక్షణ

ఖలీల్‌వాడి: జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఆర్టీసీ కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీ మండలాల అధ్యక్షులు శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.